ఎనిమల్ కేర్ సెంటర్ పరిశీలన

మొక్కను నాటుతున్న కలెక్టర్, మున్సిపల్‌చైర్‌పర్సన్, కమిషనర్

కామారెడ్డి,జూన్ 29 : కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వరపల్లిలో ఉన్న ఎనిమల్ కేర్ సెంటర్‌ను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ శనివారం సందర్శించారు. 182 కుక్కలకు పిల్లలు పుట్టకుండా శస్త్ర చికిత్స చేసినట్లు జిల్లా పశు వైద్యాధికారి సింహారావు కలెక్టర్‌కు తెలిపారు. కుక్కల సంతతి పెరగకుండా కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేస్తున్నామని అన్నారు. ఎనిమల్ కేర్ సెంటర్ ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ, మున్సిపల్ కమిషనర్ సుజాత, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

అధికారుల సేవలు మరువలేనివి

అధికారిణిని సన్మానిస్తున్న ఎంపీపీ నీరజారెడ్డి

బాన్సువాడ రూరల్, జూన్ 29: ఐదేండ్లుగా మండలంలో విధులు నిర్వహిస్తున్న పలు శాఖల అధికారుల సేవలు మరువలేనివని బాన్సువాడ ఎంపీపీ దొడ్ల నీరజారెడ్డి అన్నారు. ఎంపీపీగా ఐదేండ్లు పూర్తికానుండడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారాయణరెడ్డితో కలిసి పలు శాఖల అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా అధికారులు పూర్తి సహకారం అందించారని అన్నారు. అధికారుల సహకారంతోనే బాన్సువాడ మండలం పలు విభాగాల్లో మొత్తం 23 అవార్డులను సాధించిందని తెలిపారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుడు దుమ్మూధూళితో.. ఇప్పుడు వర్షపు నీటితో..

ప్రమాదకరంగా కామారెడ్డి - బాన్సువాడ రహదారి

కంకర ఉండడంతో రోడ్డుపై లేస్తున్న దుమ్ము (ఫైల్)

వాన కురియడంతో పారుతున్న నీరు

గాంధారి, జూన్ 29: మండలంలోని పొతంగల్ కలాన్ సమీపంలో ఉన్న కామారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా పొతంగల్ కలాన్ గ్రామ స్టేజీ నుంచి చందానాయక్ తండా వరకు పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్ రోడ్డుపై మట్టి, కంకర వేసి వదిలివేశాడు. కొన్ని నెలలుగా ఈ కంకరరోడ్డుపై ప్రయాణించిన వాహనదారులు దుమ్మూధూళితో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రోడ్డుపై నీరు ప్రవహిస్తున్నది. దీంతో రోడ్డు మధ్యలో వేసిన కంకర, మట్టి కొట్టుకుపోయి కోతకు గురైంది. రోడ్డుపై కోత కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో దుమ్ముతో ఇబ్బంది పడ్డ వాహనదారులు, ప్రస్తుతం కోతకు గురైన రోడ్డుపై ప్రయాణించాలంటే భయపడుతున్నారు. ఇప్పటికే కంకర రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ఇద్దరు మృతి చెందారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

నర్సింహులు(ఫైల్)

లింగంపేట, జూన్29: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన పెండ నర్సింహులు (34) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. నర్సింహులు మూడు నెలల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. శనివారం ఉదయం అతడు మృతి చెందినట్లు సమాచారం వచ్చింది. నర్సింహులును భార్య లలిత హతమార్చి ఉంటుందని అనుమానం వ్యక్తం చేశారు. నర్సింహులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మృతుని భార్యను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. మృతుడికి కుమార్తె, కొడుకు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు.

వాహనాల తనిఖీ

బేగంపూర్ చౌరస్తా వద్ద లారీ డ్రైవర్‌తో మాట్లాడుతున్న ఎస్సై కోనారెడ్డి

బీబీపేట్/ పెద్దకొడప్‌గల్, జూన్ 29: బీబీపేట్ మండలంలోని శ్రీగాధ రోడ్డులో ఎస్సై ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని 20 మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్ప కుండా పాటించాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది శంకర్, సాయిలు , శ్రీకాంత్ పాల్గొన్నారు.
పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారి161పై ఎస్సై కోనారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. పెండింగ్ చాలాన్లను వెంటనే చెల్లించాలని వాహనదారులకు సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని లేదంటే జరిమానా తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రవికుమార్, సాయిశివ, అంజి, రవి తదితరులు పాల్గొన్నారు.

గాంధారి తైబజార్ వేలం వాయిదా

తైబజార్ వేలం నిర్వహిస్తున్న అధికారులు

గాంధారి, జూన్ 29: గాంధారి వార సంత తైబజార్ వేలాన్ని వాయిదా వేసినట్లు గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారి (తహసీల్దార్) సతీశ్‌రెడ్డి తెలిపారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన తైబజార్ వేలానికి హాజరైన వారు కనీస మద్దతు ధర కన్నా తక్కువకు వేలం వేయడంతో వాయిదా వేశామని ఆయన తెలిపారు. దీంతోపాటు పశువుల సంతకు నిర్వహించిన వేలాన్ని లక్షా70 రూపాయలకు వాడేకర్ శ్రీధర్ దక్కించుకున్నాడని అన్నారు. తైబజార్ వేలాన్ని ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఎంపీటీసీలు తూర్పు రాజు, పత్తి శ్రీనివాస్, మండల కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న బల్దియా చైర్మన్ గంగాధర్

బాన్సువాడ టౌన్, జూన్ 29: పరిసరాల శుభ్రత అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ అన్నారు. పట్టణంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వానకాలం నేపథ్యంలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పట్టణ ప్రజలకు సూచించారు. డ్రైనేజీలో చెత్త పారవేయొద్దన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేయిస్తున్నామని, దోమల నివారణ మందు చల్లుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది హన్మాండ్లు, సతీశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దకొడప్‌గల్, జూన్ 29: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కుబ్యానాయక్ తండా పంచాయతీ కార్యదర్శి శివాజీ తండావాసులకు సూచించారు. తండాలో శనివారం పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వానకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రేపు జాతీయ గోర్ బంజారా సమ్మేళనం

లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నునావత్ గణేశ్ నాయక్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నునావత్ గణేశ్ నాయక్

కామారెడ్డి, జూన్ 29 : లంబాడా హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 1న సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జాతీయ గోర్ బంజారా సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు నునావత్ గణేశ్ నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమ్మేళనానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమ్మేళనానికి లంబాడా కులస్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాణాప్రతాప్ రాథోడ్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ నాయక్, భూక్యా రాజూనాయక్, ఎస్టీ సెల్ ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడు మదన్‌లాల్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్, ఎస్టీ సెల్ మాచారెడ్డి అధ్యక్షుడు శంకర్ నాయక్, సదర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళనాన్ని విజయవతం చేయాలి..

గాంధారి, జూన్ 29: లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించనున్న సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని గాంధారి మండల బంజారా నాయకులు కోరారు. గాంధారిలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గిరిజన తండాల నుంచి పెద్ద ఎత్తున గిరిజనులు తరలిరవాలన్నారు. సమావేశంలో అంగోత్ గణేశ్, రవికిషన్ నాయక్, మోహన్ నాయక్, సకారాం నాయక్, సర్ధార్ నాయక్, సంతోష్ నాయక్, భాగ్యా నాయక్, శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి భూమి పూజ

భోజనశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న జడ్పీ వైస్‌చైర్మన్

బీబీపేట్, జూన్ 29: మండలంలోని తుజాల్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్, ఎంపీపీ బాలామణి తదితరులు శనివారం భూమిపూజ చేశారు. భోజనశాల ఏర్పాటు కోసం మాజీ ఎంపీ, ప్రస్తుత దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అప్పట్లో రూ.ఐదు లక్షల నిధులను కేటాయించారని వారు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు చట్టాలపై అవగాహన అవసరం

అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్

రాజంపేట్, జూన్ 29: రైతు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కామారెడ్డి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కె.సుధాకర్ అన్నారు. రాజంపేటలోని రైతు వేదికలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలు, హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనీల్‌కుమార్, మండల వ్యవసాయాధికారి సుప్రజ్యోతి, న్యాయవాదులు సిద్ధిరాములు, ఆజాద్ సలీం, ఎస్సై సంపత్, రాజంపేట సొసైటీ చైర్మన్ నల్లవెల్లి అశోక్, ఏఈవోలు శిల్ప, మనీష, ఎన్జీవో ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

కూలీలకు సమగ్ర చట్టం అమలుచేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రామారెడ్డి, జూన్ 29: కూలీలకు సమగ్ర చట్టం అమలు చేయాలని ఏఐపీకేఎంఎస్(అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రామారెడ్డిలోని తెలంగాణ తల్లి విగ్రహం నుంచి తహసీల్ కార్యాలయం వరకు శనివారం కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం తహసీల్దార్ లక్ష్మణ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను తీర్చాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమేశ్, ప్రకాశ్, సురేశ్, కిషోర్, గోపాల్, వెంకట్, మధు మీన, కార్మికులు పాల్గొన్నారు.

బదిలీలతో కూడిన ప్రమోషన్లు హర్షణీయం

కామారెడ్డి, జూన్ 29: జిల్లాలోని పీఈటీలకు ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లుగా బదిలీలతో కూడిన ప్రమోషన్లు ఇవ్వడం హర్షణీయమని పేటా(టీఎస్) జిల్లా శాఖ బాధ్యులు అన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శనివారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి రాజుకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో పేటా(టీఎస్) జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్, కార్యదర్శి మధుసూదన్ రెడ్డితోపాటు అనిల్ కుమార్, మోహన్ రెడ్డి, లక్ష్మణ్, భాస్కర్ రెడ్డి, లక్ష్మణ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్, జూన్ 29: బాన్సువాడలోని శ్రీరాంనారాయణ్ ఖేడియా (ఎస్ఆర్ఎన్‌కే) ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానామస్)లో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థులు జూలై 2లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకనామిక్స్1, కంప్యూటర్ సైన్స్1, ఆంగ్లం1, ఉర్దూ1 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు పీజీలో 55శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులు ఉన్నా అర్హులని పేర్కొన్నారు. నెట్, పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

నోటుబుక్కులను పంపిణీ చేస్తున్న బల్దియా చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డి, జూన్ 29: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ శనివారం నోటు బుక్కులను పంపిణీ చేశారు. 23వ వార్డు కౌన్సిలర్ తేజ ప్రసాద్ సొంత ఖర్చుతో విద్యార్థులకు నోటు బుక్కులు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లను సమకూర్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నహీద్ ఫాతిమా, టీచర్ సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిర్‌సముందర్‌లో..

బిచ్కుంద, జూన్ 29: మండలంలోని సిర్‌సముందర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్ భాను శిరీష శనివారం స్కూల్ బ్యాగ్‌లు, నోటు బుక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విమల, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై నేడు అభిప్రాయ సేకరణ

గాంధారి, జూన్ 29: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో రైతు భరోసాపై రైతులు, సింగిల్ విండో పాలక వర్గం సభ్యులతో ఆదివారం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు విండో చైర్మన్ పెద్దబూరీ సాయికుమార్, కార్యదర్శి మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. సమావేశంలో రైతు భరోసాపై రైతులు, పాలక వర్గ సభ్యుల అభిప్రాయాలను సేకరించనున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులకు పర్యావరణ దినోత్సవ పోటీలు

బహుమతులను అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

కామారెడ్డి, జూన్ 29: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని భవిత పాఠశాలలో జిల్లా స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్ మేకింగ్, పద్య రచన పోటీలను నిర్వహించారు. జిల్లాలోని 40 పాఠశాలల నుంచి 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి, జీసీఈవో ఉమారాణి, క్వాలిటీ కో–ఆర్డినేటర్ వేణు, ఎఫ్‌పీఎస్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, బయో సైన్స్ ఫోరం అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, అకాడమిక్ కో–ఆర్డినేటర్ కృష్ణాకర్ రావు, ప్రవీణ్ కుమార్, శ్రీనివాస్, సురేశ్, సంతోష్ కుమార్, ఆయా పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ మేకింగ్‌లో సంజన ప్రతిభ..

రామారెడ్డి, జూన్ 29: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం కామారెడ్డిలో నిర్వహించిన జిల్లాస్థాయి వాల్ పోస్టర్ మేకింగ్ పోటీలో సదాశివనగర్‌లోని మోడల్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఏ.సంజన ప్రథమ బహుమతి సాధించింది. దీంతో ప్రిన్సిపాల్ భానుమతి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు ఆమెను అభినందించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, AMRAJ NARAYANA S/O AMRAJ NARSIMLU H.NO.3-1 KAMMARPALLY (DIST) NIZAMABAD CHANGED MY SURNAME AS AMRAJI NARAYANA S/O NARSIMLU.
NTZ-340066

WANTED TEACHERS

★Wanted Teachers to Teach Telugu, Hindi, English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant, Little Heart High School, Namdevwada, Nzb. Nursery to X Std. Contact No. 8309582476
NTZ-324943

CHANGE OF NAME

★I, SANTHA GANGA REDDY, S/o. Saya Reddy, R/o. H.No. 5-42/10, Bussapur (Vi), Mendora (Mdl), Nizamabad (Dist)-503 218, TS, have Changed My Name as ARUGUMEEDI GANGA REDDY for all Records purpose.
NT-97788

WANTED

★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మొక్కలు నాటిన నాయకులు

లింగంపేట/ మాచారెడ్డి, జూన్ 29: లింగంపేటలో బీజేపీ నాయకులు శనివారం మొక్కలు నాటారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న 'అమ్మ పేరిట ఒక మొక్క' కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం, పోలీస్‌స్టేషన్ సమీపంలో మొక్కలను నాటినట్లు వారు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో కార్యకర్తలకు మొక్కలను పంపిణీ చేశారు. పాల్వంచలో బీజేపీ నాయకులు మొక్కలను పంపిణీ చేశారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వారు తెలిపారు.

డయల్ 100 ఫిర్యాదులపై త్వరగా స్పందించాలి

మాట్లాడుతున్న ఏఎస్పీ నరసింహారెడ్డి

కామారెడ్డి, జూన్ 29: డయల్ 100 ఫిర్యాదుపై త్వరగా స్పందించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఫిర్యాదు రాగానే స్పందించాల్సిన బాధ్యత బ్లూ కోట్స్, పెట్రో కారు సిబ్బందిపై ఉందన్నారు. క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేపట్టి స్టేషన్ అధికారికి పూర్తి నివేదిక అందజేస్తే.. బాధితులకు తగు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జాన్డ్, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, బిచ్కుంద ఇన్‌స్పెక్టర్ నరేశ్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్లు, బ్లూ కోట్స్, పెట్రో కారు సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి దారికి మోక్షమెప్పుడో?

ఇబీ వదలపర్తి, మాల్తుమ్మెద తండాలకు వెళ్లే రోడ్డు పరిస్థితి

నాగిరెడ్డిపేట, జూన్ 29: మండల కేంద్రం నుంచి మాల్తుమ్మెద తండాతోపాటు వదలపర్తి గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. చినుకు పడితే ఈ దారిపై వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి మట్టిరోడ్డుపై తండాకు, గ్రామానికి వెళ్లాలంటే కేవలం రెండు కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. విత్తన క్షేతం భూమి నుంచి 35 సంవత్సరాల క్రితం వదలపర్తి గ్రామానికి వెళ్లేందుకు దారిని కేటాయించారు. అప్పట్లో మట్టి రోడ్డు వేశారు. నాటి నుంచి నేటి వరకు ప్రభుత్వం రోడ్డు కోసం నిధులను మంజూరు చేయలేదు. మూడేండ్ల క్రితం అప్పటి కలెక్టర్ సత్యనారాయణ విత్తన క్షేత్రం భూములను పరిశీలిస్తూ.. ఇదే మార్గంలో వదలపర్తి గ్రామానికి వెళ్లారు. రోడ్డు దుస్థితిని చూసి రూ.నాలుగు లక్షలు మంజూరు చేయిస్తానని, రోడ్డును బాగు చేసుకోవాలని సూచించారు. కానీ కలెక్టర్ బదిలీ కావడంతో నిధులు రాలేదు. దీంతో గ్రామస్తులే చందాలు వేసుకొని మట్టి రోడ్డు వేసుకున్నారు. తిరిగి ఇప్పుడు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బీటీ రోడ్డుగా మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.